"అనగనగా ఒక రాజు ప్రభూ! ఆ రాజుకి ఏడుగురు కొడుకులు ప్రభూ.... ఆ ఏడుగురూ ఒక రోజు వేటకెళ్ళారు ప్రభూ...."

ఆస్థాన కథకులవారికి అనుమానం వచ్చింది, దేవేంద్రులవారు కథ వింటున్నారా లేదా, అని.

దేవేంద్రుడు సింహాసనంమీద జారగిలబడి కూర్చున్నాడు బద్ధకంగా. రాత్రి కొట్టిన మధువు తాలూకు మైకం ఇంకా దిగినట్లు లేదు. ప్రభువులవారి ఒంటిని మూడు భాగాలు చేసి పరీక్షగా చూశాడు. ఒక భాగం కళ్ళు తెరుచుకునే వున్నాయి. రెండో భాగం కళ్ళు పూర్తిగా మూసుకుపోయి వున్నాయి. మిగిలిన భాగంకళ్ళు అరమోడ్పులుగావున్నాయి. ఎటూ తేల్చుకోలేక మళ్ళీ అడిగాడు.

"ప్రభూ.... వింటున్నారా? .... ఏడుగురు కొడుకులూ వేటకెళ్ళారు ప్రభూ.... వేటకి "

దిగ్గున లేచాడు దేవేంద్రుడు. "ఆ, వేటా? ఈమాట ఎక్కడో విన్నట్లుందే" అన్నాడు.

ఆస్థాన కథకులవారికి మతిపోయింది. రాత్రంతా గానాబజానాలతో పూటుగా తాగి ప్రొద్దున్నే ఉబుసుపోవటం లేదని, కథ లేవన్నా చెప్పమని కబురొస్తే వెళ్ళి ఈ కథ మొదలెట్టాడు.

సరే.... వేటఅంటే ఏమిటో వివరించడానికి ప్రయత్నించాడు. "వేటంటే.... ప్రభూ.... తమరు ఇదివరకు .... క్రూర మృగాల్ని, రాక్షసుల్ని, ఇంకా.... రెక్కల కొండల్ని వేటాడేవారు.... వజ్రాయుధంతో...."

"అవును గుర్తొచ్చింది. క్రూర మృగాల్ని, రాక్షసుల్ని వేటాడటంలో మజా లేదు. రెక్కల కొండల్ని వేటాడాలి. ఎవరక్కడ....?" అన్నాడు దేవేంద్రుడు.

ఆస్థాన కథకులవారు అటూ ఇటూ చూసి



"ఎవరూ లేరు ప్రభూ .... మన మిద్దరమే" అన్నాడు.

విరాగ్గా చూశాడు ఇంద్రుడు. "సరే లేవయ్యా. నా వజ్రాయుధాన్ని తెప్పించండి. రెక్కల పర్వతాలు ఎక్కడున్నాయో వాకబు చేయించండి" అని అజ్ఞాపించాడు.

వజ్రాయుధం వచ్చింది. వాడకంలేక. పదునుపోయి. కళావిహీనంగా వుంది.

వజ్రాయుధాన్ని వజ్రంతోనే పదును పెట్టాలి ప్రభూ అని సలహా ఇచ్చాడు ఆస్థాన కథకులవారు.

మొత్తానికి ఎలాగో వజ్రాయుధాన్ని పదును పెట్టించి. ఇదివరలో వేటాడగా మిగిలిన ఒక్క పర్వతమూ సముద్రంలో దాక్కున్నదని తెలిసి సపరివారంగా వేటకి బయలుదేరాడు ఇంద్రుడు.

అప్సరసలు. దేవతలు. మునులు. ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. శచీదేవి వీరతిలకం దిద్దింది.

వేట చాలాకాలం సాగింది. ప్రాణ భయంతో రెక్కల పర్వతం ముల్లోకాలూ తిరిగింది. దేవేంద్రుడు రెట్టించిన ఉత్సాహంతో వెంటపడి తరిమాడు. చివరికి ఇక ఓపికలేక స్వర్గలోకంపైన నీరసపడిపోయింది

వెంటనే, గురి చూసి వజ్రాయుధాన్ని విసిరాడు దేవేంద్రుడు. అది సూటిగా వెళ్ళి దాని రెండు రెక్కలనీ కత్తిరించివేసింది. గిలగిలా కొట్టుకుంటూ ఆ రెక్కలు తెగిన పర్వతంలా కూలిపోయింది.

పరివారం హర్షధ్వానాలు చేసింది ఇంద్రుడు విజయగర్వంతో పైకి చూశాడు. దేవతలూ మునులూ ఏరీ? పుష్పవర్షాలు కురిపించరేం?


ఇంతలో చావుకబురు చల్లగా తెచ్చాడు ఒక భటుడు-రెక్కలు తెగిన పర్వతం స్వర్గ ద్వారానికి అడ్డంగా పడివున్నదనీ లోపలి వాళ్ళు బయటకు, బయటవాళ్ళు లోపలకు వెళ్ళటం కుదరడం లేదని.

ఇంద్రుడు స్వర్గద్వారం దగ్గరకు వెళ్ళాడు ద్వారానికి అడ్డంగా పిండు కొండలా పడి వుంది పర్వతం. ఎడం కాలితో ప్రక్కకు నెట్టబోయాడు. కుదరలా. రెండు చేతులూ ఉపయోగించి ప్రక్కకు జరపబోయాడు. కదలలా. పరివారమంతా కలసి హైలెస్స అంటూ బలం అంతా ఉపయోగించారు. పర్వతంలో చలనం లేదు. ఇంద్రుణ్ణి పరిహసిస్తున్నట్లు కసిగా అక్కడే పడి వుంది. ఇంద్రుడికి తల తీసేసినంత పనయింది.



# కథాభినందనం

ప్రసన్నకుమార్ సర్రాజు



"వచ్చి సాధిస్తోంది" అని గొణుక్కున్నాడు.

అప్పటికే నలుగురైదుగురు భూలోక వాసులు అక్కడకి చేరుకున్నారు. ఒకళ్ళిద్దరు ఏమిటంత ఆలస్యం అని విసుక్కుంటున్నారు. మిగతావాళ్ళు తుండుగుడ్డలు పరుచుకుని కాసేపు నడుం వాల్చారు.

ఇంద్రుడికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. బృహస్పతి వుంటే ఏదో ఆలోచన చెప్పేవాడే. అతను కూడా స్వర్గంలో బందీ అయిపోయాడు.

దేవేంద్రుడి పరివారానికి కూడా ఇదంతా చికాకుగా వుంది.

"ముందుకొట్టి వేటకు బయలుదేరితే ఇదుగో ఇలానే అవుతుంది"
అని ఒకళ్ళిద్దరు గొణుక్కున్నారు కూడాను.

ఇంతలో ఒక భటుడు పరుగున వచ్చి కొండ అవతలనుంచి ఏవో శబ్దాలు అస్పష్టంగా వినిపిస్తున్నాయని చెప్పాడు.

ఇంద్రుడు దిగ్గున లేచాడు. కొండ దగ్గరకి వెళ్ళి చెవి ఆనించి విన్నాడు.

అవతలనుంచి "....భూ....వేంద్రా" అని వినిపించింది. దేవేంద్రుడు ఆనందంగా "ఆచార్యా నేనే మాట్లాడుతున్నాను" అన్నాడు గట్టిగా. అవతలున్నది బృహస్పతి

కాసేపు నిశ్శబ్దం. మళ్ళీ వినిపించాయి మాటలు ".... ద్రా!.... దంతా....మన....ర్మ.... చేస్తాం!.... ప్రస్తు.... కటే....పాయం వుంది.... మన.... రదుడు....oబురుడు....ట....పాడి...ర్వతాన్ని....రిగిస్తాం....న్నారు. ....నుజ్ఞ ....వ్వండి."

ఇంద్రుడికి కంగారులో సరిగా అర్థం కాలేదు "ఏమంటున్నారు ఆచార్యా! అంత నెమ్మదిగా మాట్లాడితే ఎలా వినిపిస్తుంది? కాస్త గట్టిగా చెప్పండి" అన్నాడు గట్టిగా.

కొండ అవతల. (స్వర్గద్వారానికి అవతల) దేవతలు. మునులు. అప్సరసలు చెవుల్లో దూదులు పెట్టుకుని వాటిమీద చేతులు గట్టిగా నొక్కుకుని నిల్చున్నారు.

బృహస్పతి పెట్టే కేకలకి స్వర్గం అదిరిపోతోంది.

బృహస్పతి విసుక్కున్నాడు. తనెంత గట్టిగా అరిస్తే ఆ మాత్రం లీలగానైనా వినిపిస్తోందో అర్థంచేసుకోడేం? 'మూర్ఖుడు' అనుకున్నాడు నెమ్మదిగా.

అది మాత్రం చక్కగా వినపడింది ఇంద్రుడికి.

"ఎవరిని ఆచార్యా మూర్ఖుడంటున్నారు?" కుతూహలంగా అడిగాడు.

"....న్ను కాదులే...." అని మళ్ళీ మొత్తం అరిచి చెప్పాడు ఇలా నారదుడు. తుంబురుడు పాటపాడి కొండను కరిగిస్తామంటున్నారని. అనుజ్ఞ ఇవ్వమని.

# బాల సుబ్రహ్మణ్యానికి కథాభినందనం!

"సరే" అని భయంకరంగా అరచి అనుజ్ఞ ఇచ్చేశాడు ఇంద్రుడు.

ఇంతలో భుజం మీద ఎవరిదో చెయ్యి పడితే వెనక్కు తిరిగి చూశాడు. ఒక భూలోకవాసి "ఏమిటి సరే అంటున్నారు?" అడిగాడు. ఈ అతి చనువుకి ఒళ్ళు మండినా నిగ్రహించుకుని ఏదో చెప్పబోయేంతలో ఇంకో ఇద్దరు భూలోకవాసులు వచ్చి

"ఏమిటండీ. ఇదేమన్నా బావుందా? మేం వచ్చి ఎంత సేపయింది? ఎప్పటికి మీరు మమ్మల్ని లోపలికి పంపేది?" అని విసుక్కున్నారు. అంతా చూస్తూ కూడా ఇంకా ఇలా జబర్దస్తీగా వాళ్ళు అడగడం ఇంద్రుడికి ఆశ్చర్యమనిపించింది. ఈ మానవులు ఇంతే గాబోలు. వాళ్ళ హక్కు కోసం దేవతలైనా సరే రాచి రంపాన పెడతారు అనుకున్నాడు. ఆ మధ్య నారదుడు చెప్పలా! ప్రయాణాల్లోగానీ. ఎక్కడైనా వాళ్ళ పేర ఒక స్థలం కేటాయించబడిందంటే ఇక దాని మీద ఈగ కూడా వాలనివ్వరట. ఏ మాత్రం పట్టు విడుపులు. కనికరం వుండదుట.

సాధ్యమైనంత సౌమ్యంగా కాస్సేపు ఓపిక పట్టమని. ఇలా లోపల నారదుడు తుంబురుడు పాట పాడుతున్నారని. త్వరలో కొండ కరిగిపోతుందనీ చెప్పి కాస్త దూరంగా విశ్రమించాడు.

స్వర్గానికి రావడం బుద్ధి తక్కువైంది. ఓ పద్ధతీ లేదు. పాడూ లేదు అని గొణుక్కుంటూ వెళ్ళి మిగతా భూలోకవాసుల దగ్గిర చతికిలబడ్డారు వీళ్ళు.

కాస్సేపయాక కొండ కరుగుతోందో. లేదో చూచి రమ్మని ఒక భటుణ్ణి పంపాడు. వాడు తిరిగి వచ్చి వేలితో రాసి చూశానని తేమతేమగా తగిలిందనీ చెప్పాడు.

"ఎంతైనా మన నారదుడు. తుంబురుడు" అనుకున్నాడు ఇంద్రుడు సంతృప్తిగా.

కాస్త కలతనిద్ర పట్టినట్లయింది. ఎవరో కుదుపుతున్నట్లయి కళ్ళుతెరచి చూశాడు. ఎదురుగా అతి చనువు భూలోకవాసి. తల తిప్పి చూశాడు. దూరంగా పది పదిహేను మంది భూలోకవాసులు చేరారు పిల్లాజెల్లాతో సహా.

"ఏమిటి" అని అడిగాడు.

"కొండ కరగటల్లేదు స్వామీ. పైగా నాచు పెరుగుతోంది. ఇదుగో" అని చూపించాడు. అతని గుప్పిటనిండా వివిధ రకాలైన నాచుమొక్కలున్నాయి.

దేవేంద్రుడి మొహం వెలవెలబోయింది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఇంతలో నలుగురైదుగురు ఆడంగులు గుసగుసలాడుకోవటం చూసి. "ఏమిటి వాళ్ళు అనుకునేది?" అడిగాడు. అతను అటెళ్ళి తిరిగొచ్చి. "అఁ....ఏం లేదు మా బాలసుబ్రహ్మణ్యాన్ని పిలిపిస్తే ఈ పాటికి పని అయిపోయేది గదా అనుకుంటున్నారు." అన్నాడు.

అది వినగానే ఇంద్రుడికి ఒళ్ళు మండింది. దాంతో కళ్ళుకూడా మండినట్లయి కళ్ళల్లో నిప్పులు పోసుకున్నట్లయింది. "ఎవరా బాలసుబ్రహ్మణ్యం? కొండలను పిండి చేసేంత బలశాలా?" అడిగాడు అక్కసుగా.

"చూడ్డానికలానే వుంటాడుగానీ అతను వస్తాదుగాదు. పాటపాడి కరిగిస్తాడు" అన్నాడు భూవాసి.




వామనావతారం

మహాబలిపుర శిల్పం

ఇంద్రుడికి పంతం ఎక్కువైంది. ఈ విషయమేమిటో తేల్చుకోవాలనుకున్నాడు నలుగురు దూతల్ని పిలిచి బాలసుబ్రహ్మణ్యం గారిని సగౌరవంగా తీసుకు రమ్మని పంపాడు. భూలోకవాసి అతని అడ్రసు చెప్పి భారత కాలమాన ప్రకారం పొద్దున్నే 6 గంటల లోపలే వెళ్ళమన్నాడు. ఒకవేళ ఇంట్లో దొరక్కపోతే బద్ధకించకుండా ప్రతీ స్టూడియో తిరగమన్నాడు.

నలుగురు దూతలూ సరాసరి మౌంటు రోడ్డులో దిగారు. బాలసుబ్రహ్మణ్యాన్ని కలుసుకునే ముందు ఒకసారి అతని కంఠం ఎలా వుంటుందో వినాలనిపించింది. ఎదురుగా "దేవి" థియేటర్లోకి వెళుతున్న ఒకతన్ని ఆపారు.

"ఈ హాలులో ఏం ఆడుతోంది నాయనా?" అని అడిగారు.

"గాంధీ" అని చెప్పి అతను వెళ్ళబోయాడు.

"బాబ్బాబు. ఒక్క విషయం చెప్పిపో. ఆ చిత్రంలో బాలసుబ్రహ్మణ్యం అనే అతను పాడాడా?" అని అడిగారు.

ఆ మనిషి వీళ్ళని ఎగాదిగా చూసి. "ఏ లోకంనుంచొచ్చారు? "గాంధీ"లో పాటలు లేవు. ఉంటే పాడేవాడే." అని వెళ్ళిపోయాడు.

అప్పటికే రాత్రి చాలా అయింది. ఇంత రాత్రి పూట వెడితే బాగోదులే. అదీగాక మనుష్యులు రాత్రి కాగానే విశ్రమిస్తారు గదా అని ఆ రాత్రికి గాల్లోనే వుండి. మర్నాడు పొద్దున్నే కామదార్ నగర్ వెళ్ళారు.

బయట గేటు తీసుకుని లోపలికి ప్రవేశించారు. వరండాలో ఒక శాల్తీ కూచుని పేపరు చదువుతోంది. గేటు శబ్దం విని ఇటు చూడగానే ఒక దూత అడిగాడు. "బాలసుబ్రహ్మణ్యం అనే గాయకులు ఉండేది ఇక్కడేనా?"

ఆ శాల్తీ చిరునవ్వు నవ్వి. "అవును ఆ గాయకులు ఉండేది ఇక్కడే. మీరే కంపెనీ? తెలుగా. టమిళా. కన్నడమా. మళయాళమా? హిందీయా?" అని అడిగింది.

"సంస్కృతం" చెప్పారు దూతలు.

వెంటనే ఆ శాల్తీకి ఉత్సాహం వేసింది. ఎన్ని పాటలు? ఎవరు మ్యూజిక్కు?" ఎక్కడ రికార్డింగ్? ఎప్పుడు కాల్షీటు?" అని అడిగింది గబగబా.

దూతలు విసుక్కున్నారు. "మీతో మాకేమిటి? ఆ గాయకులవారిని పిలుస్తారాలేదా? అన్నారు అసహనంగా.

వెంటనే ఆ శాల్తీ లేచి నిలబడి. "నేనే ఆ గాయకులవారిని" అంది. అంతే! వెంటనే ఒక దూత అతని చెయ్యి పట్టుకున్నాడు. మరుక్షణం అయిదుగురూ మాయమయిపోయారు.

అప్పుడే గేటులోంచి లోపలకు వస్తున్న ఒక నిర్మాత ఇది చూసి కూడా ఆశ్చర్యపోకుండా. "ఏమిటో ఈ మనిషికి స్నేహితులెక్కువ. ఎప్పుడు మాయమవుతాడో. ఎక్కడ ప్రత్యక్షం అవుతాడో చెప్పడం కష్టం...." అని నిట్టూర్చి వెనుదిరిగాడు.

పైన స్వర్గంలో ప్రత్యక్షమైనమరుక్షణం బాలసుబ్రహ్మణ్యం చుట్టూ చూశాడు. ఎదురుగా కిరీటాలు పెట్టుకుని దేవభటులు. మధ్యన ఇంద్రుడు.

ఇటు ప్రక్కన అప్పటికేచుట్టూమూగిన భూలోకవాసుల్ని చూసి "ఏమిటి? షూటింగు చూట్టానికొచ్చారా? ఇదే స్టూడియో? స్వర్గం సెట్టింగా? నాకేమిటో అంతా అయోమయంగా వుంది" అన్నాడు.

ఆటోగ్రాఫులు అడుగుతున్న కుర్రకారుని కసిరి ఒక భూలోకవాసి "అయ్యా! తమరిని చూడగలగటం మా అదృష్టం. బతికున్నప్పుడు చూడలేకపోయాను. ఇది స్వర్గం సెట్టింగు కాదు నిజం స్వర్గమే. అయితే ద్వారానికి ఇవతలివైపు వున్నాం. అంతే" అని క్లుప్తంగా జరిగింది చెప్పారు.

వెంటనే బాలసుబ్రహ్మణ్యం ఇంద్రుడి మీద ఎగరబోయాడు.

కుదరక కేకలేశాడు.

"ఏమిటండీ ఇది? పెద్ద మనుషులు చేసే పనేనా ఇది? నాతో చెప్పా పెట్టకుండా చెయ్యి పట్టుకుని లాక్కొచ్చేయడమేనా! నాకవతల బోలెడు రికార్డింగులున్నాయ్. మధ్యాహ్నం బొంబాయి వెళ్ళాలి కూడాను" అని దులిపేశాడు.

ఇంద్రుడికి అతన్ని చూడగానే ఏం అనిపించిందో వెంటనే దగ్గరికొచ్చి "బాబ్బాబు. ఇవి చేతులు కావు" అంటూంటే "అలా కాపాలు పెట్టకండి రేపు నాది కంఠం కాదంటే దేంజరు" అని జోకెయ్యబోయి ఊరుకున్నాడు.

"దయచేసి ఆ కొండను కరిగించి మా అందరినీ కాపాడు నాయనా" అని బ్రతిమిలాడాడు ఇంద్రుడు.

ఇక ఎక్కువసేపు బ్రతిమాలించుకుంటే బాగోదని ఏకాగ్రతగా పాడేసి కొండ మొత్తం కరిగించేశాడు. పని అయిపోయాక ఇంద్రుడు బాలసుబ్రహ్మణ్యానికి గొప్ప సన్మానం చేసి సగౌరవంగా మళ్ళీ భూలోకం పంపేశాడు.

తర్వాత కొన్నాళ్ళకి భూలోకం నుంచి సర్జన్ల బృందం ఒకటి స్వర్గలోకం వెళ్ళింది. ఇక్కడ నారద తుంబురులనే గాయకులు ఉన్నారటగదా. వాళ్ళ సహాయం కోసం వచ్చాము అన్నారు.

ఎందుకని అడిగితే రాళ్ళు కరిగించాలని చెప్పారు.

"ఏం. మీ బాలసుబ్రహ్మణ్యం ఉన్నాడుగా. అతని చేత పాడించుకోపోయారా?" అన్నాడు తుంబురుడు అక్కసుగా.

"ఆయన పాడితే పెద్ద ప్రాణానికే ప్రమాదంలెండి. మనిషి మొత్తం కరిగిపోయే ప్రమాదం ఉంది" అన్నారు సర్జన్లు.

"ఇంతకీ ఏం కరిగించాలి?" అడిగాడు నారదుడు అనుమానంగా.

"కిడ్నీస్‌లో రాళ్ళు" సర్జన్ల సమాధానం.

✻

## నిజానిజాలు

నిన్నుచూచి ఎంతో కాలమైనా
నిన్ను తలచి ఎంతో కాలేదు
నిన్ను కలిసి యుగాలు గడిచినా
నీ రూపం కనిపించి క్షణం కాలేదు



అగ్గి ఆరిందని పైన బుగ్గి చెప్తున్నా
బుగ్గికింద అగ్గి మండుతూనే వుంది
ఏరు పేరుకుందని పై పొర చెబుతున్నా
దానిక్రింద ప్రవాహం పరుగులు
తీస్తూనే వుంది
కారుమబ్బుల అంధకారం నింగిని
కప్పినా
దివ్వెవంటి దినకరుడు దాని వెనక
ఉన్నట్టు

ఇవి నా ప్రేమకి ఆధారాలు
ఇవి నే కల్పించిన అర్థాలు
ఇవి నే రాసిన శిలాక్షరాలు
నీవు చూడలేని నిజానిజాలు.

—అరవింద, లండన్